సాక్షి ప్రకాశం
సోమవారం । 2 । జనవరి । 2023



అదుపు తప్పిన బైకు ఇద్దరు యువకుల దుర్మరణం

ఒంగోలు నగరంలో బైకు అదుపు తప్పి ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. - 8లో..



గ్రానైట్ ట్రాలీ కింద పడి ఒకరు మృతి

గ్రానైట్ ట్రాలీ కిందపడి ఒకరు మృతిచెందిన ఘటన రామతీర్థానికి వెళ్లే దారిలో జరిగింది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
30 /20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఐజీని కలిసిన ఎస్పీ మలికా గర్గ్



ఐజీ త్రివిక్రమ్‌కు బొకే అందిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: నూతన సంవత్సరం రోజున గుంటూరు రేంజి ఐజీగా పదోన్నతి పొందిన గుంటూరు రేంజి డీఐజీ డాక్టర్ సి.యం.త్రివిక్రమ్ వర్మను ఆదివారం ఎస్పీ మలికా గర్గ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐజీకి పూల బొకేను అందించి నూతన సంవత్స శుభాకాంక్షలు తెలిపారు.

సుపరిపాలన వేదిక అధ్యక్షునిగా నాగేశ్వరరావు

ఒంగోలు అర్బన్: సుపరిపాలన వేదిక (ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్) నూతన అధ్యక్షుడిగా మాగులూరి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సుపరిపాలన వేదిక ఆధ్వర్యంలో స్థానిక శుభప్రద ఫంక్షన్ హాలులో వేదిక నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎంవీ శేషయ్య ఆధ్వర్యంలో గత ఏడాది సంస్థ కార్యక్రమాలను సమీక్షించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా చిట్టెం వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షునిగా ఎంవీ శేషయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె షాకీర్, నాగభూషణం, రంగారెడ్డి, ట్రెజరర్‌గా రంగనాథం, లీగల్ సలహాదారుగా సుంకర సాయిబాబా, కార్యవర్గ సభ్యులుగా దండి వెంకటేశ్వర్లు, తాతా శ్రీనివాసరావు, దివ్య, రమణారెడ్డి ఎంపికయ్యారు.



ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ నూతన కమిటీ సభ్యులు



వీర్లకొండ.. ఎక్కేద్దాం రండి!

ప్రకృతి సౌందర్యానికి నెలవైన నల్లమల అభయారణ్యం పర్యాటకులకు స్వర్గధామం. ఇప్పటికే జంగిల్ సఫారీతో యాత్రికులను ఆకట్టుకుంటున్న అటవీ శాఖ.. మరో అడుగు ముందుకేసింది. ట్రెక్కింగ్‌పై ఆసక్తి ఉండేవారి కోసం వీర్లకొండ వద్ద ట్రెక్కింగ్ పాయింట్ ఏర్పాటు చేసింది. టెక్కింగ్ చేసే పర్యాటకుల కోసం స్థానిక గిరిజనులను గైడ్‌లుగా వినియోగించనుంది. ఫలితంగా వారికి ఉపాధి లభిస్తుంది. పచ్చని కొండలను సాహసోపేతంగా ఎక్కేయాలని సరదాపడుతున్నారా.. వీర్లకొండ విశేషాలేంటో చూద్దాం రండి..

- నల్లమలలో ట్రెక్కింగ్
- తుమ్మలబైలు వద్దనున్న వీర్లకొండ అనువుగా గుర్తింపు
- ట్రెక్కింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఇప్పటికే కొండ శిఖరంపై వాచ్ టవర్ ఏర్పాటు
- గైడ్‌లుగా గిరిజనులు

పెద్దదోర్నాల: నల్లమలలో పర్యటించే యాత్రికులకు వసతి, సౌకర్యాలు కల్పించటంతో పాటు వారిలోని ఉత్సాహం, పట్టుదల, ధైర్య సాహసాలను ప్రదర్శించేందుకు అటవీశాఖ సరికొత్త కార్యక్రమాలను రూపొందించనుంది. పర్యాటకులకు చిన్న చిన్న సాహసాలతో కూడిన ఎన్నో అడ్వంచర్లను చేపట్టేందుకు అద్భుత అవకాశాన్ని కల్పించే దిశగా అడుగులు వేయనుంది. ఇందులో భాగంగా ఇప్పటికే శ్రీశైలం వెళ్లే యాత్రికుల కోసం రెస్టు రూములు, సావనీర్ షాపులు ఏర్పాటు చేసిన అధికారులు సరికొత్తగా పర్వతారోహణ (ట్రెక్కింగ్)కు అవకాశం కల్పించి యాత్రికులకు ఉల్లాసాన్ని కలిగించనున్నారు. ఇందు కోసం మండల పరిధి తుమ్మలబైలు సమీపంలోని వీర్లకొండ అనువుగా ఉందన్న విషయాన్ని గుర్తించిన అధికారులు యుద్ధప్రాతిపదిన పర్వతారోహణ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు ఉత్సాహవంతులైన గిరిజన యువకులకు ఉపాధి కల్పించటంతో పాటు, అటవీశాఖ కూడా కొంత ఆదాయం సమకూర్చుకోనుంది.



వీర్లకొండపై ఏర్పాటు చేసిన వాచ్ టవర్

వీర్లకొండ వద్ద ట్రెక్కింగ్ ఏర్పాట్లు వేగవంతం

అటవీశాఖ సరికొత్తగా ఏర్పాటు చేయనున్న ట్రెక్కింగ్ కార్యక్రమానికి పెద్దదోర్నాల, తుమ్మలబైలు మధ్య ఉన్న వీర్లకొండ అనువుగా ఉంటుందన్న విషయాన్ని గుర్తించిన అధికారులు కొన్ని రోజుల కిందట వీర్లకొండ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అక్కడి వాతావరణ పరిస్థితులతో పాటు, వన్యప్రాణుల సంచారం, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రెక్కింగ్‌కు సంబంధించిన పనులు ఇప్పటికే మొదలయ్యాయి. పర్వతారోహణకి అనువుగా వీర్లకొండ పైకి నడిచి వెళ్లేందుకు నడక మార్గాన్ని ఏర్పాటు చేయటంలో అటవీశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. నడక దారిలో అడ్డంగా ఉన్న చెట్లకు ఏమాత్రం నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయటంతో పాటు, దట్టంగా ఉన్న గడ్డి పొదలను తొలగించే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో తుమ్మలబైలు గిరిజన గూడేనికి 2 కిలోమీటర్లు ముందుగానే వీర్లకొండ వస్తుందని, శ్రీశైలం ప్రధాన రహదారిలోనే వీర్లకొండ ఉండటం వల్ల యాత్రికులు, పర్యాటకులు నడవాల్సిన అవసరం లేకుండా వారి వాహనాలను అక్కడే పార్కింగ్ చేసుకోవటానికి వీలుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రధాన రహదారి వద్ద నుంచి కొండపైకి ఎక్కేందుకు 500 మీటర్లు, కొండ దిగేందుకు 500 మీటర్లు మొత్తంగా ఒక 1 కిలో మీటరు మేర ట్రెక్కింగ్ ఉంటుంది. ట్రెక్కింగ్‌కు సంబంధించి ఒక్కొక్కరికి రూ.300 మేర ట్రెక్కింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. దీనికి సంబంధించి వీర్లకొండపై ఇప్పటికే వాచ్ టవర్‌ను అధికారులు సిద్ధం చేశారు. దీంతో పాటు అత్యాధునిక బైనాక్యులర్‌ను ఏర్పాటు చేసి నల్లమల అభయారణ్య పరిసరాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశాన్ని అధికారులు కల్పించనున్నారు. ఇప్పటికే కొండపైకి నడక మార్గాన్ని సిద్ధం చేశారు. ఈనెలాఖరు నాటికి ట్రెక్కింగ్‌కు పర్యాటకులకు అనుమతించనున్నారు.



వీర్లకొండలో ట్రెక్కింగ్‌కు సంబంధించిన నడక మార్గం

ట్రెక్కింగ్‌తో చెంచు గిరిజనులకు ఆర్థికాభివృద్ధి

నల్లమలలో ట్రెక్కింగ్ ఏర్పాటు చేయటంతో పాటు అక్కడి చెంచు గిరిజనులకు ఆదాయ మార్గాలను పెంపొందించేందుకు అవకాశం ఉంటుంది. కొంత మంది గిరిజన యువకులకు శిక్షణ ఇచ్చి వారిని గైడ్‌లుగా ఏర్పాటు చేసి వారి సేవలను వినియోగించనున్నారు. ఇందులో భాగంగా ట్రెక్కింగ్‌కు వెళ్లే ఒక్కో పర్యాటకుడితో పాటు ఒక్కో గైడు వారి వెంట ఉంటారు. ట్రెక్కింగ్‌కు వెళ్లే వారిని జాగ్రత్తగా తీసుకెళ్లటంతో పాటు, నల్లమల విశిష్టతను తెలియజేయటం, వారి రక్షణ పట్ల జాగ్రత్తలు తీసుకుని వారిని మళ్లీ తిరిగి కిందికి తీసుకురావటం గైడ్‌లు చూసుకుంటారని అధికారులు పేర్కొంటున్నారు. దీని వల్ల ఒక్కో గైడుకు అటవీశాఖ వసూలు చేసే రూ.300 రుసుములో రూ.200 గైడ్‌లకే ఇస్తామని అటవీశాఖ రేంజి అధికారి విశ్వేశ్వరరావు తెలిపారు. ప్రతి యువకుడికి రోజుకు రెండు పర్యాయాలు మాత్రమే అవకాశం ఉంటుంది. దీని వల్ల ఎక్కువ మంది యువకులకు గైడ్‌గా ఉండే అవకాశం కలుగుతుంది.

> **ట్రెక్కింగ్ పనులు వేగవంతం**
>
> నల్లమలలో పర్యటించే యాత్రికులు, పర్యాటకుల కోసం ఎన్నో బృహత్తర కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా తుమ్మలబైలు వద్ద పర్వతారోహణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ట్రెక్కింగ్‌తో గిరిజన యువకులకు ఆదాయ మార్గాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం. దీని వల్ల పర్యాటకులకు మరొక సందర్శనీయ ప్రాంతంగా వీర్లకొండ మారనుంది. – విశ్వేశ్వరరావు, ఫారెస్టు రేంజి అధికారి

నూతన సంవత్సర వేళ.. ఆనంద హేల



తన నివాసం వద్ద న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు

- ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల నివాసాల్లో న్యూ ఇయర్ వేడుకలు
- న్యూ ఇయర్ కేక్‌లు కట్ చేసిన ఎమ్మెల్యే బాలినేని, ఎంపీ మాగుంట, కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు: నూతన సంవత్సర వేడుకలను జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా జరుపుకున్నారు. శనివారం అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలకు కేక్‌లు కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆటపాటలతో యువత ఉత్సాహంగా సందడి చేశారు. పలుచోట్ల పాటకచేరీలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధుల నివాసాల వద్ద న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతోపాటు సాధారణ ప్రజానీకం కూడా పెద్ద ఎత్తున వచ్చిన తమ అభిమాన నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద ప్రత్యేక వేదికపై సతీమణి శచీదేవితో కలిసి బాలినేని కేక్ కట్‌చేసి సంబరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని తన నివాసం వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికీ అల్పాహారం ఏర్పాటు చేయడంతోపాటు ప్రత్యేకంగా ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను పంపిణీ చేశారు. బాలినేనిని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు కూడా పాల్గొని బాలినేనికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ గత ఏడాది కన్నా ఈ ఏడాది మరింతగా ప్రజలకు కలిసి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వానికి అండగా ఉండి 2024 ఎన్నికల్లో విజయఢంకా మోగించేందుకు సహకారం అందించాలన్నారు.

మాగుంట కార్యాలయం వద్ద..

స్థానిక రాంనగర్‌లోని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాగుంట అభిమానులు పాల్గొని మాగుంటకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ అల్పాహారం అందించారు. అదే విధంగా కార్యాలయం వద్ద పాటకచ్చేరి ఏర్పాటుచేసి నాయ కులు, కార్యకర్తలు, అభిమానుల్లో జోష్ నింపారు.



న్యూఇయర్ కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్ దంపతులు

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో..

ఒంగోలు అర్బన్: నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా అధికారుల సమక్షంలో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఆయన సతీమణి, బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఇరువురూ కలిసి న్యూ ఇయర్ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రముఖులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. పలు సంఘాలు రూపొందించి ముద్రించిన కొత్త సంవత్సరం క్యాలెండర్లు, డైరీలను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి, యువ నాయకుడు శిద్దా సుధీర్, డీఆర్‌ఓ ఓబులేసు, డీఎస్పీ నాగరాజుతో పాటు ఆర్డీవోలు, తహశీల్దార్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసు శాఖ అధికారులతో పాటు అన్నీ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అధికారులకు వారి కార్యాలయాల్లో సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి



బాలినేనికి శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి



తన కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

వేడుకలా పింఛన్ల పంపిణీ



పెంచిన పింఛన్ నగదు వృద్ధురాలికి అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- నూతన సంవత్సరంలో పండుగలా మొదటిరోజు పింఛన్ల పంపిణీ
- పెంచిన పింఛన్లు తీసుకుంటూ సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- జిల్లాలో కొత్తగా మంజూరైన పింఛన్లు 9,669

ఒంగోలు సబర్బన్: నూతన సంవత్సరం అవ్వా, తాతల మోముల్లో చిరునవ్వులు పూయించింది. సంక్షేమ రథ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలు, నిరుపేదల ఇళ్లలో ఆనందాలు వెల్లివిరియాలన్నదే లక్ష్యంగా ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచుకుంటూ పోతున్నారు. నూతన సంవత్సరంలో మొదటి రోజు పింఛన్ల పంపిణీ ఒక పండుగ వాతావరణంలో సాగింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచి వాలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, డీఆర్‌డీఏ అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లు అందజేశారు. దాదాపు 8 రకాల పింఛన్లకు సంబంధించి గత నెల వరకు నెలకు రూ.2,500 ఇచ్చేవారు. అలాంటిది ముఖ్యమంత్రి ఆ మొత్తాన్ని 2023 జనవరి నుంచి రూ.250 చొప్పున పెంచటంతో అది రూ.2,750 చేరింది. దీంతో పింఛనుదారుల్లో ఎక్కడ లేని ఆనందం నెలకొంది. అర్హులైన వారికి నూతనంగా జిల్లాలో 9,669 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేశారు. దీంతో ఆయా కుటుంబాల్లో కూడా సంతోషం నిండింది. నూతనంగా పెంచిన పింఛన్లను కలెక్టర్ దినేష్ కుమార్ తన క్యాంపు కార్యాలయంలో, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తన నివాసంలో 36వ డివిజన్ కార్పొరేటర్ ఢాకా సుజాత హనుమారెడ్డి ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ, జిల్లాలో పింఛన్ల పంపిణీ నోడల్ ఆఫీసర్ బి.బాబూరావు టంగుటూరు మండలంలోని యరజర్ల, సూరారెడ్డిపాలెం గ్రామాలకు వెళ్లి ఆయన స్వయంగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ ఏడాది నూతనంగా ఇచ్చిన పింఛన్లతో పాటు పాత పింఛనుదారులకు కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవ్వా తాతలకు..అక్కచెల్లెమ్మలకు తన సందేశాన్ని కూడా జతచేసి డబ్బులతో పాటు సందేశం లేఖను లబ్ధిదారులకు అందిస్తున్నారు.

- కొత్తగా మంజూరైన పింఛన్లు 9,669
- కొత్తగా మంజూరైన పింఛన్లకు గాను ప్రభుత్వం అందస్తున్న నగదు రూ.3,13,02,750
- కొత్తగా పెంచిన రూ.250 చొప్పున అందుకోనున్న లబ్ధిదారుల సంఖ్య 2,37,700
- పెంచిన పింఛన్ల వల్ల ప్రభుత్వం మీద పడుతున్న అదనపు భారం రూ.5,99,25,000
- డిసెంబర్ 2022 వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్నిరకాల పింఛన్లు 2,82,502
- డిసెంబర్ 2022న జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం చెల్లించిన పింఛన్ల మొత్తం నగదు రూ.72,37,92,500
- ఈ నెల నుంచి జిల్లా వ్యాప్తంగా అందించనున్న పింఛన్లు 2,92,171
- ఈనెల చెల్లించాల్సిన మొత్తం పింఛన్ల సొమ్ము రూ.81,50,20,250
- కొత్తగా ఎంపిక చేసిన పింఛన్లు, పెంచిన పింఛన్లు కలుపుకొని ప్రభుత్వంపై ప్రతి నెలా పడుతున్న అదనపు భారం మొత్తం రూ.9,12,27,750



మహిళకు పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్



సూరారెడ్డిపాలెంలో వికలాంగునికి పింఛను అందిస్తున్న డీఆర్‌డీఏ పీడీ బి.బాబూరావు

పోటా పోటీగా పచ్చ శిబిరాలు



ప్రత్యర్థి వర్గంతో వాదిస్తున్న ఇన్‌కంట్యాక్స్ అధికారి కోటేశ్వరరావు

- ఒకరిపై ఒకరు ఆరోపణలకు దిగిన వైనం

యర్రగొండపాలెం: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా టీడీపీ నాయకులు ఆదివారం పోటాపోటీగా శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా వర్గాల నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ఘర్షణకు దిగారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మార్కాపురం రోడ్డులోని తన నివాస గృహం వద్ద, నియోజకవర్గంలో టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా రెండుసార్లు పోటీచేసి ఓటమి పాలైన బూదాల అజితారావు, టీడీపీ నాయకుడు డాక్టర్ మన్నె రవీంద్రతో కలిసి త్రిపురాంతకంలోని రవీంద్ర వైద్యశాలలో శిబిరాలు ఏర్పాటు చేసుకొని తమ వద్దకు వచ్చిన అభిమానులతో వేడుకలు జరుపుకుంటున్నారు. ఈ తరుణంలో అజితారావు భర్త, ఇన్‌కంట్యాక్స్ అధికారి కోటేశ్వరరావు.. ఎరిక్షన్ బాబు శిబిరం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఆయనను రోడ్డుపైనే కొంతమంది నిలిపి వాదనకు దిగారు. కాసేపు రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం ఎరిక్షన్‌బాబు వర్గానికి చెందిన పలువురు అజితారావు ఏర్పాటు చేసుకున్న శిబిరం వద్దకు వెళ్లి ఘర్షణకు దిగారు. అక్కడ రవీంద్ర ఘర్షణకు దిగిన వ్యక్తులను వారించడంతో వారు వెనుతిరిగి వెళ్లారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ తారాస్థాయికి చేరక ముందే పోలీసులు రంగప్రవేశం చేయడంతో వారిమధ్య జరుగుతున్న వాదనలకు తెరపడింది. ఇదేమి ఖర్మ అంటూ తెలుగు తమ్ముళ్లు ఇరు వర్గాలు ఏర్పాటు చేసుకున్న శిబిరాల వద్దకు వెళ్లి నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


కలెక్టర్ దినేష్‌కుమార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి


ఎంపీలు మాగుంట, శ్రీకృష్ణదేవరాయలును సత్కరిస్తున్న జంకె, పార్టీ నాయకులు


జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్


కనిగిరి : ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను సన్మానిస్తున్న పామూరు మండల నాయకులు

నూతనోత్సాహం

జిల్లాలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, ఎంపీలు మాగుంట, లావు శ్రీకృష్ణదేవరాయలు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, బుర్రా మధుసూదన్, టీజేఆర్ సుధాకర్‌బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్


ఎస్పీ మలికాగర్గ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీ మాగుంట


మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి స్వీటు తినిపిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళి


జంకె వెంకటరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు


వరికూటి అశోక్‌బాబుకు శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ నాయకులు

క్లుప్తంగా

పాల వ్యాన్ ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతుడు అత్తంటి మాలకొండయ్య

వలేటివారిపాలెం: పాల వ్యాన్ ఢీకొని మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం పోలినేనిపాలెం ఆంజనేయస్వామి గుడి దగ్గర జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పోలినేనిపాలెం గ్రామానికి చెందిన అత్తంటి చిన్న మాలకొండయ్య(71) రోడ్డు మార్గాన గుడి దగ్గర నుంచి తన గ్రామానికి నడిచి వస్తుండగా కందుకూరు వైపు నుంచి పాల వ్యాన్ డ్రైవర్ అతివేగంగా నడిపి అత్తంటి మాలకొండయ్యను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై సుదర్శన్ యాదవ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నల్లమల ఘాట్ రోడ్డులో లారీ బోల్తా


బోల్తా పడిన సిమెంట్ లారీ

గిద్దలూరు రూరల్: సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటన గిద్దలూరు మండల పరిధిలోని నల్లమల ఘాట్ రోడ్డులో ఆదివారం వేకువ జామున చోటుచేసుకుంది. వివరాలు.. నంద్యాల నుంచి మార్కాపురానికి సిమెంట్ లోడుతో బయలుదేరిన లారీ, నల్లమల ఘాట్ రోడ్డులో పాత రైల్వే బ్రిడ్జి మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం నుంచి లారీ డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయట పడ్డారు.

ఉప్పుటేరులో పడి యువకుడు మృతి


ఉప్పుటేరులో పడి మృతి చెందిన శివకుమార్‌రెడ్డి

ఉలవపాడు: ప్రమాదవశాత్తు ఉప్పుటేరులో పడి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని బద్దిపూడిలో శనివారం రాత్రి జరగ్గా ఆదివారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కొలకలపూడి శివకుమార్‌రెడ్డి (38) పశువులు ఇంటికి రాక పోయే సరికి వాటిని వెతుకుతూ శనివారం రాత్రి ఉప్పుటేరు దగ్గరకు వెళ్లాడు. పశువులు నీళ్లల్లో ఉన్నాయనే అనుమానంతో దుస్తులు ఒడ్డున పెట్టి నీళ్లల్లోకి దిగి మునిగిపోయాడు. శనివారం రాత్రి వెళ్లిన శివకుమార్‌రెడ్డి ఆదివారం ఉదయం వరకు ఇంటికి రాక పోయే సరికి కుటుంబసభ్యులు ఉప్పుటేరు దగ్గరకు వెళ్లి చూడగా ఒడ్డున ఉన్న దుస్తులు కనిపించాయి. దీంతో ఆందోళన చెందిన వారు స్థానికుల సహాయంతో ఏరులోకి దిగి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉలవపాడు పీహెచ్‌సీకి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నరసాయపాలెంలో దొంగనోట్ల కలకలం


నకిలీ రూ.500 నోట్లు

యర్రగొండపాలెం: మండలంలోని నరసాయపాలెంలో దొంగనోట్లు కలకలం సృష్టించాయి. ఆదివారం పింఛనుదారులకు గ్రామ వలంటీరు ముటుకూరి ఆమోష్ పంపిణీ చేసిన డబ్బుల్లో ఈ దొంగనోట్లు బయటపడ్డాయి. తన పరిధిలోని 43 మందికి పింఛనుదారులకు రూ.2,750 చొప్పున రూ.1,18,250ను వేకువ జామున 4 గంటలకు వలంటీర్ పంపిణీ చేశాడు. అందులో 39 రూ.500 నకిలీ నోట్లు 20 మంది లబ్ధిదారులకు అందాయి. గ్రామానికి చెందిన లబ్ధిదారు మరియమ్మ హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడికి డబ్బు పంపించే క్రమంలో దొంగ నోట్ల విషయం బయటపడింది. వెంటనే పంచాయతీ కార్యదర్శి స్పందించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నరసాయపాలెం సచివాలయం పరిధిలో ఏడుగురు వలంటీర్లు ఉండగా, వారిలో ఆమోష్ పంపిణీ చేసిన నగదులో మాత్రమే దొంగనోట్లు ఉన్నాయని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు పేర్కొన్నారు. విచారణ సమయంలో దొంగనోట్లు తానే తీసుకొచ్చి లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు ఆమోష్ ఒప్పుకున్నాడని చెప్పారు. ఎంపీడీఓ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

అదుపుతప్పిన బైకు.. ఇద్దరు యువకులు దుర్మరణం

- ఉలిక్కిపడిన బిలాల్ నగర్
- నిరుపేదల కుటుంబాల్లో విషాదం

ఒంగోలు టౌన్:

ఒంగోలు నగరంలో నూతన సంవత్సరం రోజున విషాద ఘటన చోటుచేసుకుంది. తెల్లవారుజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక బిలాల్‌నగర్‌కు చెందిన షేక్ ఆసిఫ్(20), పాపాకాలనీకి చెందిన శివ(16) ఆదివారం తెల్లవారుజామున బైకు మీద అద్దంకి బస్టాండ్ సెంటరు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో నవభారత్ థియేటర్ దాటిన తర్వాత బైకు అదుపుతప్పి పడిపోయారు. ఆసిఫ్ తలకు డివైడర్ బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలై కొన ప్రాణంతో ఉన్న శివను అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని టూటౌన్ ఎస్సై సాంబశివరావు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేతికి అందివచ్చిన సమ యంలో..

బైకు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు యువకులిద్దరూ నిరుపేద కుటుంబాలకు చెందిన వారు. గుంటూరు రోడ్డులో సర్వీస్ పాయింట్ నిర్వహిస్తూ బతుకుబండిని నెట్టుకొస్తున్న షేక్ రహిమాన్‌కు ఇద్దరు కుమారులు. 10వ తరగతి వరకు చదువుకున్న ఆసిఫ్ తండ్రికి చేదోడుగా ఉండేందుకు సీసీ కెమెరాలు బిగించే పనికి వెళ్తున్నాడు. ఇటీవల రహమాన్‌కు పక్షవాతం రావడంతో ఆయన మంచానికి పరిమితం అయ్యారు. దీంతో ఇంటి బాధ్యత పెద్ద కొడుకైన ఆసిఫ్ మీద పడింది. ఇలాంటి తరుణంలో స్నేహితులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనడానికి వెళ్లిన ఆసిఫ్ ప్రమాదం బారిన పడి ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. కాగా పాపా కాలనీలో నివాసం ఉండే కేతావత్ చందునాయక్ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. పెద్ద కుమారుడు మధు నాయక్ తండ్రితో పాటు ఆటో నడుపుతున్నాడు. చిన్నవాడు శివ ఆటో మెకానిక్ పని నేర్చుకుంటున్నాడు. బైకు ప్రమాదంలో శివ ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబాన్ని ఓదార్చడం కష్టంగా మారింది.


శివ(ఫైల్)


మృతులు ఆసిఫ్ (ఫైల్)


సంఘటనా స్థలంలో ఆసిఫ్ మృతదేహం

పోలీసులు అలా వెళ్లగానే..

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా ఎస్పీ మలికా గర్గ్ ముందస్తు జాగ్రత చర్యలు చేపట్టారు. నగరంలోని 20 ముఖ్యమైన కేంద్రాలను గుర్తించి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో తెల్లవారుజాము వరకు పోలీసులు నగరంలో గస్తీ తిరిగారు. ఉదయం 4 గంటల తర్వాత పోలీసులు అలా వెళ్లారో లేదో పెద్ద సంఖ్యలో యువకులు రోడ్ల మీదకు వచ్చినట్లు సాక్షులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే నవభారత్ థియేటర్ సెంటర్‌లో బైక్ ప్రమాదం సంభవించి ఇద్దరు యువకులు ప్రాణాలే కోల్పోయారు.

హోరాహోరీగా పోలురాధా ఎడ్ల పందేలు


బలప్రదర్శలో సత్తా చాటుతున్న ఎద్దు

చీరాల టౌన్: రాష్ట్రస్థాయి పోలురాధా ఎడ్ల పందేలు హోరాహోరీగా సాగుతున్నాయి. మండలంలోని ఈపూరుపాలెం పంచాయతీలోని బోయినవారిపాలెం గ్రామంలో శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి పోలురాధ ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. నూతన సంవత్సరం సందర్భంగా గత 20 ఏళ్లుగా ఎడ్ల పోటీలను నిర్వహించడం గ్రామానికే గర్వకారణం అన్నారు. ఎడ్ల బలప్రదర్శన తిలకించటానికి, పోటీల్లో పాల్గొనేందుకు గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి పశుపోషకులు తరలి వచ్చారు. పోటీల్లో 27 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఎడ్ల బలప్రదర్శనలో ప్రేక్షకులు ఈలలు, కేరింతలతో బోయినవారిపాలెం హోరెత్తింది. పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20,116, ద్వితీయ బహుమతిగా రూ.15,116, తృతీయ బహుమతిగా రూ.10,116, నాలుగో బహుమతిగా రూ 7,116, 5వ బహుమతిగా రూ.5,116, ఆరో బహుమతిగా రూ.3116 అందిస్తున్నామన్నారు. ఉత్కంఠభరితంగా జరిగిన ఈ పోటీలను ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం బహుమతులు పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌కేశవులు, ఆర్బీకే చైర్మన్ రమణారెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ జీ శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ చంద్రమౌళి, నిర్వాహకులతో పాటు అధిక సంఖ్యలో పశుపోషకులు, ప్రజలు పాల్గొన్నారు.


ఎడ్ల పోటీలు ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

గ్రానైట్ ట్రాలీ ఢీకొని బాలుడు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చీమకుర్తి: స్కూటీని గ్రానైట్ ట్రాలీ ఢీకొనడంతో ఓ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మధుకాన్ గ్రానైట్స్ ఎదురు చోటుచేసుకుంది. ప్రమాదంలో జక్కుల శివశంకర్(15) అక్కడికక్కడే మృతి చెందగా వేటగిరి అఖిల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. వెలిగండ్ల మండలం గుడిపాటిపల్లెకు చెందిన శంకర్ తండ్రి మునిస్వామి మర్రిచెట్లపాలెం గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. సెకండ్‌షో సినిమా టిక్కెట్ల కోసం శివశంకర్, అఖిల్, మరో వ్యక్తి కలిసి స్కూటర్‌పై మర్రిచెట్లపాలెం నుంచి చీమకుర్తి వస్తున్నారు. అదే సమయంలో వెనుక నుంచి స్కూటర్‌ను గ్రానైట్ ట్రాలీ ఢీకొట్టింది. బండి మీద ఉన్న ముగ్గురిలో శివశంకర్ ట్రాలీ వైపు చక్రాల కింద పడటంతో శరీరం నుజ్జునుజ్జయింది. అఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మరొక వ్యక్తి ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్ వెళ్లి క్యాన్సర్ బాధితురాలికి పింఛను పంపిణీ


పిచ్చమ్మకు పింఛను నగదు అందజేస్తున్న వలంటీర్

ముండ్లమూరు: ప్రకాశం జిల్లా ముండ్లమూరుకు చెందిన క్యాన్సర్ బాధితురాలు మేదరమెట్ల పిచ్చమ్మకు గ్రామానికి చెందిన వలంటీర్ షేక్ జాన్‌బాషా హైదరాబాద్ వెళ్లి పింఛను నగదును ఆదివారం పంపిణీ చేశారు. పిచ్చమ్మ కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. హైదరాబాద్‌లో ఉంటూ చికిత్స పొందుతోంది. ప్రభుత్వం నూతనంగా పెంచిన పింఛను సొమ్ము రూ.2,750ను లబ్ధిదారురాలికి వలంటీర్ అందజేశారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

- రూ.3 లక్షల ఆస్తి నష్టం

మర్రిపూడి: పొగాకు క్యూరింగ్ చేస్తుండగా పచ్చాకు కర్ర మొద్దు పొగ గొట్టంపై పడి బ్యారన్ అగ్నికి ఆహుతైంది. ఈ సంఘటన మండలంలోని జగ్గరాజుపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని నరసరాజుపాలెం పంచాయతీ జగ్గరాజుపాలెం గ్రామానికి చెందిన పాలెపు వెంకట్రామయ్య పొగాకు బ్యారన్‌లో సుమారు 1180 పొగాకు కర్రలు క్యూరింగ్ చేస్తున్నారు. ప్రమాదవశాత్తు అల్లుడు కర్ర మొద్దు గొట్టంపై జారి పడటంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. కొండపి అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేసేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈలోగా బ్యారన్ మొత్తం అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.


మంటలు అదుపు చేస్తున్న కొండపి అగ్నిమాపక సిబ్బంది

పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా వైవీ నియామకం


యనమల వెంకటేశ్వర్లు

ఒంగోలు: పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా యనమల వెంకటేశ్వర్లు(వైవీ)ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జి.సత్యప్రభాకరరావు ఉత్తర్వులు జారీచేశారు. ఈ నియామకం ఈనెల 2వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ హోదాలో మూడేళ్లపాటు ఆయన కొనసాగనున్నారు. సోమవారం ఉదయం వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించనున్నారు. యనమల వెంకటేశ్వర్లు గతంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షునిగా కూడా పనిచేశారు.